

# దోస్త్ మేరా దోస్త్..

- నేడు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం
- స్నేహమేర జీవితం.. స్నేహమేరా శాశ్వతం
- మంచిని పంచేదే దోస్తానా
- భాష లేని ఓ బంధం, ఆత్మీయతకు ప్రతిరూపం

**రక్త సంబంధానికి సమానంగా.. అంతకంటే ఎక్కువగా ఆత్మీయ అనుబంధాన్ని పంచేది స్నేహితులే.. అందుకే అద్వితీయం.. వర్ణించలేని భావం.. వెన్నంటే నిలిచే ఆపన్నహస్తం.. భాషలేని ఓ బంధం, ఆత్మీయతకు ప్రతిరూపం.. అందుకే 'స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం'.. 'దోస్త్ మేరా దోస్త్'.. అంటూ నిర్వచించాడో కవి. తల్లిదండ్రులు, తోబుట్టువులు లేని వారు ఉంటారు కానీ.. దోస్తానా లేని జీవితాలు ఉండవు.. మంచిని పంచుతూ భాషలేని బంధంగా, ఆత్మీయతకు ప్రతిరూపంగా నిలుస్తున్నది. అందుకే రానురాను స్నేహాలు మరింత పెరిగాయి. సమాచార విప్లవం రాకతో కొత్త స్నేహాలు చిగురిస్తూనే ఉంటాయి.**

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 04 (డైలీ రిపోర్ట్);

ఏటా ఆగస్టు మొదటి ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం నిర్వహించుకోవాలని యూఎన్వో ప్రకటించింది. హాల్‌మార్క్ కార్డ్ వ్యవస్థాపకుడు జోయస్‌హల్ 1919లో మొదటి సారి ఫ్రెండ్‌షిప్ డే గురించి ప్రస్తావించాడు. అప్పటి నుంచి ఫ్రెండ్స్ అందరూ గ్రీటింగ్ కార్డులు, శుభాకాంక్షలు చెప్పుకోవడం ప్రారంభించారు. ఆ తర్వాతే నేషనల్ అసోసియేషన్ ఆఫ్ గ్రీటింగ్ కార్డుల సంస్థ స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించడం మొదలు పెట్టిందని చెబుతారు. మరికొంత మంది స్నేహం అనే గొప్ప అనుభూతిని సంబురంగా మార్చుకోవాలన్న ఆలోచనలోంచి పుట్టిందే స్నేహితుల రోజని, 1935లో యూనైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్ ఆగస్టు మొదటి ఆదివారాన్ని జాతీయ స్నేహితుల రోజుగా ప్రకటించింది. ఈ ఆనవాయితీని ప్రపంచం అంతా కొనసాగిస్తోందని మరికొందరు చెబుతారు.

ప్రస్తుత స్నేహాలు యాంత్రికతమవుతున్నాయి. కమ్యూనికేషన్ పెరిగినా కలుసుకోవడం అరుదు అవుతోంది. స్మార్ట్ ఫోన్లు, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో చాటింగ్, వీటన్నింటి ద్వారా వెళ్తున్న స్నేహ ప్రవాహం, స్నేహితులలో కలిసిన వాట్సాప్ గ్రూపుల్లో చాటింగ్‌లతోనే ప్రతిరోజు ఒకరికొకరు పలకరించుకుంటున్నారు. దీంతో నిత్యం స్నేహితులు ఒకరికొకరు కలుసుకోవడం ద్వారా కలిగే అపురూప అనుభూతిని దూరం చేసుకుంటున్నారు. అనుభూతి, భావోద్వేగాలపరంగా చూసుకున్నా..స్నేహాలు వర్ధిల్లాలంటే మిత్రులను కలవాలని మానసిక శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

స్నేహితుడి పట్ల విజ్ఞతతో వ్యవహరించడం చాలా అవసరం. సమయ సందర్భాలను బట్టి మాత్రమే స్పందించాలి. స్నేహితుని లోపాలను ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా, అతని మేలుకోరి సున్నితంగా తెలియజెప్పాలి. నేడు స్నేహం కూడా కృత్రిమమై పోయింది. మొహమాటపు స్నేహాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మనసు లోతుల నుంచి పెల్లుబికే స్నేహ సంబంధాలు చాలా అరుదు. స్నేహం ముసుగులో మోసం, దగా, వంచన కొనసాగుతున్నాయంటే అతిశయోక్తి కాదు.స్వార్థం, స్వలాభం కోసం స్నేహాన్ని కవచంగా వాడుకునే నీచ స్వభావులకూ కొరత లేదు. అవసరం మేరకు స్నేహం, ప్రేమ నటిస్తూ, అవసరం తీరాక ముఖం చాటేసే మహానుభావులూ ఉన్నారు. నిజానికి, స్నేహానికి మించిన సంపదగానీ, సత్కార్యంగానీ మరొకటి లేదు. ఇతరులను ప్రేమించలేనివారికి, స్నేహితులు లేనివారికి జీవితంలో ఎన్ని ఉన్నా నిరుపయోగమే. స్నేహ ధర్మాన్ని పాటిస్తేనే ఇహమైనా, పరమైనా దైవం మనందరికీ మంచి స్నేహితులను, సద్బుద్ధిని ప్రసాదించాలని, పరస్పర స్నేహ సంబంధాలలో వృద్ధిని, శుభాన్ని కలుగజేయాలని కోరుకుందాం.